# పెరోల్

## (Parole)

స్వతంత్ర భారతదేశంలో జైళ్ళు కళకళలాడుతున్న మహోజ్వలమైన రోజులు అవి.

హంతకులూ, జరులూ, చోరులూ, నేరస్తులతో నిండి ఉండవలసిన కారాగారాలు, నేరారోపణ లేని, నేర విచారణలేని అక్రమ నిర్బంధానికి గురైన కొత్త రకమైన ఖైదీలతో నిండిన జైళ్ళు వినూత్న కాంతులీనుతున్నాయి.... ఆ పర్వదినాలలో రాజ్యాంగ సవరణలు, ఆర్డినెన్సులు, అరెస్టులు సర్వ సామాన్యమైన పోయి, అంతరంగిక భద్రతా చట్టంపేరిట, దేశంలోని రాజకీయ ప్రత్యర్ధులందరినీ బంధించి జైళ్ళలో కుక్కటం ఒక కర్మకాండలా కొనసాగిపోయింది.

జైళ్ళు కిక్కిరిసిపొయ్యాయి.

మూడు వందల అరవై రోజులు కటకటాల వెనుక గడిచి పొయ్యాయి. కాలెండర్లలో పన్నెండు నెలలు చినికి పొయ్యాయి. డిటెన్యూలుగా వ్యవహరించబడిన ఈ రాజకీయ నిర్బంధితులు తమ భార్యా పిల్లలను, తల్లిదండ్రులనూ చూడాలనే కోరికతో తపించిపోసాగారు. జైలు నుండి విడుదల, ఒక పగటి కలగా మిగిలి పోయిన ఈ నిర్భాగ్యులు కనీసం ఒక్క నెల రోజుల శెలవు కొరకు తల్లడిల్లి పోసాగారు.

ఒక్క నెల రోజుల శెలవు - నెల రోజుల తాత్కాలికమైన విడుదల - దీనినే ఇంగ్లీషులో రిలీజ్ అన్ పెరోల్ అంటారు. కాలక్రమేణా, అది 'పెరోల్'గానే మిగిలిపోయింది.

జైలులో తనతోటి డిటెన్యూలు మిత్రులకు లభ్యం కాని ఈ అసామాన్యమైన, అపురూపమైన నెల రోజుల శెలవు కోటేశ్వర్రావ్ గారికి

దొరికింది. ఈ వార్తను పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారు పంపారు. ఆకుపచ్చ ఇన్‌లాండ్ కవరు ఈ శుభవార్తను మోసుకొచ్చింది. ఆ వార్త చదివి ఉబ్బితబ్బిబ్బయిన శ్రీ రావ్‌గారు వెల్లికిలా పడుకున్నారు. మళ్ళీ మళ్ళీ చదివాడు. ఉత్తరాన్ని గుండెలపై పెట్టుకొని సిగరెట్ అంటించాడు.

ధారళమైన పొగవిడుస్తూ కిటికి చెంత నున్న సాలెగూడును పరీక్షగా చూడసాగాడు.

సాలీడుదారాలు అల్లుతోంది. ఉచ్చులు అల్లుతోంది. సాలెగూడు మధ్యలో ఒక కేంద్రం. ఆ బిందువు చుట్టూ వృత్తాకారంగా అల్లిక. ఎంతో నేర్పుగా గణిత శాస్త్ర పరిజ్ఞానం ఉపయోగించి అల్లింది. చిన్న చిన్న సూక్ష్మక్రిములూ, ఈగలూ అందులోపడి తన్నుకుంటున్నాయి – జైల్లోపడిన డిటెన్యూల్లా.

వెల్లికిలా పడుకొని సాలీడు కదలికలు గమనిస్తున్న రావ్‌గారికి నిద్ర రావడం లేదు. లేచి నున్నగా గడ్డం గీచుకున్నాడు. ఇస్త్రీ చేసిన గళ్ళ లుంగీ నడుంపైకి ఎక్కించి, మురికి లుంగీని కాళ్ళతో తన్నేశాడు ఓ మూలకు. ఆనందంతో తొణికిసలాడుతూన్న తన ముఖాన్ని మరొకసారి అద్దంలో చేసుకొన్నాడు. తెల్ల షర్ట్ వేసుకొని పై గుండీలు విప్పుకొని ఛాతి విరుచుకొని, ఇతర డిటెన్యూలున్న బ్యారక్‌వైపు నడిచాడు.

వార్డ్ వార్డ్‌కు తిరగసాగాడు.

బెడ్ – బెడ్‌కు వెళ్ళసాగాడు.

మధ్యాహ్నం రెండు గంటలు. డిటెన్యూలు హాల్స్‌లో పడుకున్నారు హాస్పిటల్లో రోగుల్లా.

బెడ్ ప్రక్కనే బెడ్. కాలుదించే స్థలం వదిలి బెడ్, వరుసగ్గా అమర్చివున్నాయి. బయట ఎండ చిటచిటలాడుతోంది. పావురాలు పైన వెంటిలేటర్స్‌లో చేరి కువకువలాడుతున్నాయి. కొందరు పుస్తకాలు ఛాతిపై పెట్టుకొని గురక పెడ్తున్నారు. కొందరు చదువురాని వయస్సు మళ్ళిన డిటెన్యూలు గచ్చు నేలపై కూర్చుని పలకపై ఎ.బి.సి.డీ.లు దిద్దుతున్నారు.... చిన్నా పిల్లలా....

అంతా నిశబ్దం.

అంతలో చిన్న కలకలం – అందరూ లేచి కూర్చోసాగారు గుంపులు గుంపులుగా ప్రోగవసాగారు.

"కోటేశ్వర్రావు గారికి పెరోల్ దొరికిందట..." గసిబోసికొంటూ చెప్పుకుపోతున్నాడు. అగంతకుడు మల్లయ్య.... మంత్రి గారి ఆకస్మిక మరణవార్తలా ఏదో అసాధారణ సంఘటన జరిగినట్లు ఎదురుగ్గా ఉన్న 'బ్యారక్'లో ఎనౌన్స్ చేశాడు.

"అదృష్టవంతుడు.... గుడ్ న్యూజ్" చదువుతున్న పుస్తకం దిండు కిందబెట్టి లేచి కూర్చున్నాడు రామరాజు.

"అల్ట్రాలెఫ్ట్ రాజకీయ పార్టీల వాళ్ళకు 'పెరోల్' మంజూరు చెయ్యటం జైలు చరిత్రలో ఇదే మొదటిసారి నాకు తెలిసినంతవరకు... ఇది చాలా విశేషమే"... ఆర్.కె. రావ్ సన్నని మంగుళూరు బీడి ముట్టించుకొని ఎదురుగా ఉన్న మంచంపై కూర్చున్నాడు.

"ఏడీ, మరి రావ్‌గారు రావటంలేదే, ఈ వార్త మన చెవిని వేయటానికి, మరి ఎప్పుడు రిలీజ్ చేస్తారట... " రామరాజు అన్నాడు.

"ఏమో నేను ఇప్పుడే ముస్లింవార్డులో అబ్దుల్ కుద్దూస్ సాబ్‌తో చెబుతూంటే విన్నాను. అన్ని వార్డులూ తిరగటం అయిపోయింది ఒక మన 'వార్డ్' మాత్రమే లాస్టనుకోండి."

"చాలా శుభవార్త చెప్పావ్ మల్లయ్యా! అయితే 'ఛాయి' పెట్టించుదామా?" రామరాజు అన్నాడు.

"పెట్టించండి సార్... ఏదో ఆయన పేరు చెప్పుకుని మేము కూడా ఒక 'కప్' లాగించిపారేస్తాం. పగలబడి నవ్విన మల్లయ్య సమాధానం కొరకు ఎదరు చూడకుండా డైనింగ్ హాలువైపు తిరిగి కిటికీ నుండి కేక పెట్టాడు.

"వెంకన్నా... ఓ వెంకన్నా... గురువు గారు 'ఛాయి' పెట్టించమంటున్నారు. పది పదిహేను 'కప్పులు' కిటికి చువ్వలు పట్టుకొని పెద్దగా అరిచాడు.

"పెరోల్‌కు అప్లయి చెయ్యటం ఇది ఏ పదకొండోసారో కావచ్చు. మొత్తానికి కోటేశ్వర్రావ్‌గారు సాధించారండీ... పాపం ఎన్నాళ్ళకు మళ్ళీ ఇంటికి పోతున్నాడు..." ఒక సానుభూతి ప్రకటన.

పెరోల్ దొరకటానికి రావ్‌గారు ఏఏ ప్రయత్నాలు చేశారో, ఏఏ కారణాలు చూపితే ప్రభుత్వం కన్విన్స్ అయిందో ఊహాగానాలు వ్యాఖ్యానాలు సాగిపోసాగాయి. ఎన్నెన్నో నిజమైన కారణాలతో వినతి పత్రాలు వ్రాసుకొని, వాటిని పట్టించుకొనే నాధుడే లేక 'పెరోల్' ఆశ పూర్తిగా విరమించుకొన్న అమాయకులు కొందరు దిగులు చూపులతో వింటున్నారు.

"పోయిన నెల భూపతిరావ్ గారికి దొరకటంకూడా విశేషమే!"

"ఏం విశేషం!... అంతా భోగస్.... ప్రతిపక్షాలమని చెప్పుకుంటూనే మంత్రి పుంగవులతో సంబంధాలు పెట్టుకొన్నవాళ్ళకు, పెరోల్ దొరుకుంతుంది. లేకపోతే చుట్టరికమన్నా వుండాలి... బావమరిది జనసంఘ్, అన్న కమ్యూనిస్ట్, తమ్ముడు కాంగ్రెస్... ఒకే కుటుంబంలో కొందరు ప్రతిపక్షాలు, కొందరు పాలకవర్గమయితే పనులు చకచక సాగిపోతాయి..." ఈ శెలవు తమకురాకుండా రావ్ గారికే రావడంతో అసూయపడిన కొందరు అసహనంతో విమర్శిస్తున్నారు.

అంతలోనే కోటేశ్వర్రావ్‌గారు...

వారి వెనక ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులూ, ముస్లిమ్ [illegible]న్యూలూ, అందగా ఒక కెరటంలా [illegible]కు కదులుతూ [illegible] జరుగుతున్న బ్యారక్ వైపు నడవసాగారు.

"రండి... రండి... చాలా సంతోషం 'ఎట్‌లాస్ట్' యు వన్ – మొత్తానికి మీరు సాధించారు..." రామరాజు లోనికి ఆహ్వానించాడు.

అందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. నేను అన్ని ప్రయత్నాలు విరమించుకొన్నాను. బయటికి వెళ్ళే అన్ని ఆశలూ వదులుకున్నాను... ఏదో అందర్నీ విడిచినప్పుడే నాకూ విముక్తి అని గుండె రాయి చేసుకొని ఉంటున్నాను... ఇదంతా మా అమ్మాయి గొప్పతనం." కుర్చీలో కూర్చుంటూ ఆయన అన్నారు.

రావ్‌గారితో వచ్చిన మిత్రబృందం మంచం అంచులపై కూర్చున్నారు. వాళ్ళ ముఖాలల్లో కుతూహలం. బయటికి వెళ్ళటానికి చెయ్యవలసిన హంగామా అంతా తెలిసికోవాలన్న ఉబలాటం. "పెరోల్ ఎవరిస్తారు?... స్టేట్ హోం మినిస్టర్ తలచుకుంటే అవుతుందా? అన్నిటికీ ముఖ్యమంత్రి గారేనా?"

అన్న ప్రశ్నలతో వాళ్ళ తల వేడెక్కిపోసాగాయి.

అయితే విశేషమే. పెద్దవాళ్ళు సాధించలేని పనిని చిన్న పిల్ల సాధించిందంటే, నిజంగా ఎంత గొప్ప విశేషం... చాలా ధైర్యంగల పిల్లని..." అభివందనలు తెలుపుతున్నారు.

"నేను జైలుకు వచ్చినప్పుడు యస్.యస్.సి. చదువుతోంది. ఇప్పుడు ఇంటర్‌మీడియట్ ఫైనలియ్యర్... ఇంటిలో కూడా చాలా పొదుపులెండి... ఇక నేను జైల్లోకి వచ్చాక తమ్ముళ్ళను గదమాయించి పొదుపు చేసి ఇల్లు తీర్చిదిద్దుతోంది." ఆయన కళ్ళలో పితృవాత్సల్యం.

అది సరేగానీ... రావ్‌సాబ్... ఇప్పటివిషయం చెప్పండి... ఈ పైరవీ ఎట్లా చేసిందట?...

"అదా? ఇదిగో ఈ ఉత్తరం చదువుకోండి..." అరుపూపంగా దాచిన నీలిరంగు' ఇన్‌ల్యాండ్ కవరు' నలగనీయకుండా జాగ్రత్తగా జేబులో నుండి బయటికి తీశాడు.

ఆ ఉత్తరం అందుకున్న వ్యక్తి చుట్టూ కుతూహలం ఆపుకోలేని ఆ డిటెన్యూలు ముసురుకోసాగాయి. అందర్నీ సంతృప్తి పరచటానికై అతను ఆ ఉత్తరాన్ని బిగ్గరగా చదవసాగాడు.

ప్రియమైన నాన్న గార్కి, నమస్కారములు.

మీ పెరోల్ నిమిత్తమై దాదాపు ఒక నెల రోజుల క్రితం దరఖాస్తు ఇవ్వటం మీకు తెలుసు. అందులో అమ్మ ఆరోగ్యం బాగులేదని, ఈ పరిస్థితుల్లో మా నాన్న గారు ఇంటివద్ద వుండటం చాలా అవసరమని పేర్కొన్నాం. దానిపై ఎంక్వయిరీ చెయ్యమని హోం డిపార్ట్‌మెంట్ సి.ఐ.డి. శాఖ వారికి వ్రాసింది. వారు మన ఊరి పోలీసు పటేల్‌కు వ్రాశారు. అన్నీ ఫార్మాలిటీస్. మీకు

తెలియనిదేముంది? అన్నీ వాస్తవ విషయాలైనా అన్నిటికి సర్టిఫికేట్లు రిపోర్టులూ కావాలి. అన్నీ చేయించాం. శెలవు అవసరమని పోలీసువాళ్ళతో గట్టిగా వ్రాయించాం.

మన దరఖాస్తు పోలీసు రిపోర్టూ చదివిన తరువాత 'చీఫ్ సెక్రటరీ' 'పెరోల్ రిజెక్టిడ్' - అని వ్రాశాడు. శలవుమంజూరు చెయ్యబడదని వ్రాశాడు ఇదంతా బ్యూరాక్రసీ.

నాకు చాలా కోపం వచ్చింది. నేను ధైర్యం చేసి సి.ఎం.ని కలిశాను. మంత్రిగారు నాకు ఇంటర్వ్యూ ఇవ్వరని భయపడ్డాను. కానీ వారు ఏ మూడ్‌లో ఉన్నారో మరి. నాకు వెంటనే ఇంటర్వ్యూ దొరికింది. ఒక్క చీఫ్ సెక్రటరీ గారు 'రిజెక్టిడ్' అని వ్రాస్తే సరిపొయ్యే దానికి, ఫైలు క్రింది నుండి పైకి పోవాల్సిన అవసరమేముందని, వాదించాను. ఆయన మొదట 'కాద'న్నాడు. చీఫ్ సెక్రటరీ గారి చర్యను సమర్థించాడు.

కానీ నేను ధైర్యంగా మాట్లాడాను మా నాన్న గారిని జైల్లో వుంచి రెండు సంవత్సరాలు దాటిపోయింది. మీరు ఒక్క నెలరోజులు 'పెరోల్' ఇవ్వకపోతే ఇంటి వద్ద మా పరిస్థితి ఏం కావాలని గట్టిగా అడిగాను.

పలుకుబడి ఉన్నవాళ్ళకు పదేపదే ఇస్తున్నారని కూడా వాదించాను. నా మాటలన్నీ విని ఆయన చిరునవ్వు నవ్వాడు. టైపు చేయించిన అప్లికేషన్ వారికిచ్చాను. ఒక్క నెల పెరోల్ మంజూర్ చేస్తున్నానని సంతకం చేశాడు. దానిని చీఫ్ సెక్రటరీ గారికి చూపించి ఆర్డర్ పట్టుకుపొమ్మన్నాడు.

అదే ప్రయత్నంలో వున్నాను. బహుశా ఆ ఆర్డర్ శనివారం నాటికి తయారు కావచ్చు. ఆర్డర్ తీసుకొని నేను ఆదివారం ఉదయం వరంగల్ వస్తాను. సోమవారం ఉదయం పది గంటలకు మీరు రిలీజ్ అయితే సాయంత్రానికి ఇంటికి వెళ్తాం. 'అబ్బ' - ఎన్ని సంవత్సరాల తరువాత మీరు మాతో కలిసి ఉండబోతున్నారు నాన్న!

సోమవారం ఉదయానికల్లా బట్టలూ, అవీ సిద్ధం చేసుకొని రెడీగా ఉండండి మీరు. అమ్మకు కూడా ఇప్పుడే ఉత్తరం వ్రాస్తున్నాను. టైం లేదు. చీఫ్ సెక్రటరీ వద్దకెళ్ళాలి. నమస్కారములతో...

మీ కుమార్తె - నిర్మల

"అయితే మీరు ఎల్లుండి వెళుతున్నారన్న మాట... చాలా సంతోషం." ఉత్తరం చదివిన వ్యక్తి ఆ ఉత్తరాన్ని మంచంపై పెడుతూ అడిగాడు.

"అవును సార్!... ఈ నెల రోజుల్లో ఎన్నో పనులు చెయ్యాలి... వాళ్ళకున్న ఆర్థిక ఇబ్బందులు మనం ఈ నెలలో తీర్చలేమనుకోండి... అయినా ప్రయత్నం చేసి వస్తాను...."

"మనం అనుకుంటాంగానీ... చూస్తా... చూస్తానే ఈ నెల రోజులు అయిపోతవి. ఏ పనీ కాదు... పనులూ గినులూ పెట్టుకోకుండా పిల్లలతో హాయిగా కాలం గడిపి రండి".... ఒకరి సలహా.

"డబ్బుంటే గదా!... హాయిగా కాలం గడపడానికి... పోయిననాటి నుండి అప్పు కోసం తిరగటమే..." కోటేశ్వర్రావ్ గారు జవాబిచ్చారు.

వెంకన్న 'కెటిల్' పట్టుకొచ్చాడు. 'కుక్' అతని వెనుక కప్పులున్న ట్రే పట్టుకొని వచ్చాడు. హాలులో కూర్చున్న అందరి చేతుల్లోకి కప్పులు వెళ్ళాయి. ఖాళీ అయిన కప్పులు 'ట్రే'లో కూర్చున్నాయి. అందరూ లేచారు.

"అయితే సోమవారం అందరమూ గేటుదాకా వచ్చి దిగబెట్టి కార్యక్రమం మాకున్నదన్న మాట". ఆర్.కె.రావ్ తన సన్నని మంగుళూరు బీడిని రాసి కిటికీ నుండి అవతలికి విసిరేశాడు లేచి నిలబడుతూ.

"అంపకాలు.... అత్తగారింటినుండి పుట్టింటికి పంపాలి. "అందరూ తాగి మిగిలిన 'టీ'ని తన కప్పులోకి వంపుకుంటున్న మల్లయ్య అన్నాడు.

.......

రెండు రాత్రిళ్ళు గడిచాయి.

సోమవారం ఉదయం ఆరుగంటలు. డిటెన్యూల లాకప్పులు విడిపోతున్నాయి. డిటెన్యూ గదులకు కాపలా కాసిన తాబేలు నోళ్ళు విప్పుకుంటున్నాయి. తలుపు రెక్కలు రెండుగా విడిపోతున్నాయి. బార్లగా తెరుచుకున్న తలుపుల వెనుక డిటెన్యూల మంచాలు - మంచాలపై డిటెన్యూలు. శవరూపంలో ముసుగుతన్నిన శరీరాలు ఆకారాలు పోల్చుకోటానికి వీలు లేకుండా నిండా ముసుగు బెట్టి నిద్రపోతున్నారు..... మిలటరీ కిట్స్‌లా.

కోటేశ్వర్రావ్ గారి మంచం ఖాళీగా ఉంది. సెంట్రీ పోలీస్ ముఖం వివర్ణమై పోయింది. డిటెన్యూ నెంబర్ ఫోర్ బెడ్ ఖాళీగా వుంది. అనుమానంగా కళ్ళు తిప్పి బాత్‌రూంకేసి చూశాడు సెంట్రీ. బాత్‌రూం నుండి స్నానం చేస్తున్న చప్పుడు. సన్నని బాత్‌రూం సంగీతం. హృదయంలోని ఆనందాన్ని వ్యక్తపరుస్తున్న అస్పష్టమైన ధ్వనులు. ఖాళీగా వున్న బెడ్‌పై ఉండవలసిన నాల్గవమనిషి బాత్‌రూంలో ఉన్నాడు. ఆ అలికిడి విన్న సెంట్రీ పోలీసు సంతృప్తిగా నిట్టూర్చి బయటకి వెళ్ళిపొయ్యాడు.

స్నానం ముగించుకొన్న కోటేశ్వర్రావ్ తెల్లని లుంగీ ధరించాడు. బనీను వేసికొని చుట్టూ పరికించి చూశాడు. తోటి డిటెన్యూలు ఇంకా గుర్రుపెడుతూనే వున్నారు. ఈజీ ఛెయిర్ వరండాలోకి లాక్కుని కూర్చున్నాడు – పుస్తకం పట్టుకొని.

ఎదురుగ్గా గులాబీలు – ఎర్ర గులాబీలు – విరగబూసిన గులాబీలు. డిటెన్యూల శ్రమ ఫలితంగా, శ్రద్ధాసక్తుల కారణంగా జైలు ఆవరణంతా విరగబూసిన గులాబీ పువ్వులతో కళకళలాడుతోంది. వాటి వెనుక అరటి చెట్టు. మువ్వల్లో పసుపు పచ్చని, పల్చని లేత ఆకులు. పేపర్ గుండ్రంగా ముడిచినట్లున్నాయి. దూరాన సెంట్రీ గోపురాలపై గుంపులు – గుంపులుగా ఎగురుతున్నాయి పావురాలు.

రోజు చూసే గులాబీలు.

సంవత్సరాలుగా చూస్తున్న అరటిమొక్కలు.

అనునిత్యం చూస్తున్న పావురాలు.... అవే... కానీ ఈరోజు అతని కళ్ళకు ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. వాటిల్లో నూతనత్వం కనిపిస్తోంది. తనకు వాటి కదలికలో కొత్త జీవితం గోచరించసాగింది.

మనస్సు ఆనందంగా వుంటే తన చుట్టూ ఉన్న ప్రకృతి ఆకర్షణీయంగా వుంటుంది.

పుస్తకంలో ఉన్న ఉత్తరాన్ని మరొకసారి చదువుకొన్నాడు. ఆలోచనల్లో మునిగిపోసాగాడు.

"బహుశా తన పెరల్‌ను గూర్చిన టెలిగ్రాం వచ్చి వుండవచ్చు. రాకేం చేస్తుంది?... అమ్మాయి వ్రాసింది కదా! శనివారం నాటికి ఆర్డర్ పూర్తవుతుందని. ఇంకా కొద్ది సేపటికి కానిస్టేబుల్ వస్తాడు. " పదిగంటలకల్లా రిలీజ్ చేస్తారు. తయ్యారుగా వుండమ"ని.

రాత్రి డ్యూటీలో ఉన్న జెయిలర్, టెలిగ్రామ్ మెసేజ్ చదివాడో లేదో?... చదివి వుండవచ్చు... కానీ వాళ్ళకేం తొందర... అందులోనూ ఇప్పుడు కానిస్టేబుల్స్ డ్యూటీ మారేవేళ. నైట్ డ్యూటీ వాళ్లు దిగిపోయి, డే డ్యూటీ వాళ్లు వస్తారు. అందువలన కూడా కొంత లేటు... "సరే... కానియ్యి ఒక్క అర్ధగంటల్లో పొయ్యేదేముంది? ఈలోగా బట్టలు సర్దుకొంటే.... బట్టలు సర్దుకోవడమెంతసేపు పని.... చిటికెలో పని.... ఆర్డర్ రావాలేగానీ..."

'బ్యారక్' గోడలోని అర్ధవృత్తాకారపు రేకు గేటు కిర్రుమంది.

దృష్టి అటుమరల్చుకున్నాడు ఆశగా. కానిస్టేబుల్ కాదు.... వంటమనిషి పాల సీసాలు పట్టుకొని 'కిచెన్' లోకి వెళ్ళిపోతున్నాడు. అరటి చెట్లలోకి చూస్తూ మళ్ళీ ఆలోచనల్లోకి జారిపొయ్యాడు.

".... పది గంటలకు విడిచి పెడితే.... అదిఎటుకాని వేళ. కిచెన్‌లో భోజనాలు సిద్ధం కావు.... ఇకపోతే... పదకొండు గంటలకు ఏదో ఒక హోటల్‌లో భోజనం చెయ్యాలి. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రెండున్నరకు గానీ రాదు. ఖమ్మం పొయేసరికి అయిదున్నర, ఆరు అవుతుంది.... ఆరింటికి బస్ ఎక్కితే మన ఊరు చేరేసరికి పొద్దుగూకుతుంది. చీకటిపడిపోతుంది. పాపం బుజ్జిది.... పరిగెత్తుకుంటా తనకు ఎదురొచ్చి గుండెలపైకెక్కితుంది.... బస్సు లేటయితే మాత్రం నిద్రపోతుంది. నిద్రపోదనుకుంటా?.... నాన్న వస్తాడని ఎదురు చూస్తుండవచ్చు ఈరోజు.

పోతే... చుట్టాలు... వాళ్ళందరికీ ఈపాటికి తెలిసి ఉండవచ్చు - తను వస్తున్నట్లు. బహుశా అందరూ రారు. అన్నయ్య - వదినే - వాడి పిల్లలు, డెఫినిట్‌గా వస్తారు. బావగారు రాకపోయినా అక్క తప్పనిసరిగా వస్తుంది... బావమరిది సరేసరి... వాళ్ళందరూ తనను చూడంగానే "గొల్లు"న ఏడుస్తారు.

బంధువులు తనను చుట్టుముట్టి ఏడుస్తారనేతలంపు అతనికి ఎనలేని దుఃఖం కలిగించింది. ముఖం బుసబుసా పొంగింది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగి చెంపలపై జారిపొయ్యాయి. ఛాటుగా వాటిని తుడుచుకున్నాడు.

"కోటేశ్వర్రావ్ గారూ...! అప్పుడే లేచారే మీరు కాఫీ వచ్చిందా" పల్కరించసాగారు - అప్పుడే లేచి మంచాలపై కూర్చుని ఒళ్ళు విరుచుకుంటూ ఆవులిస్తూన్న తోటి మిత్రులు. ఆ పల్కరింపుల వలన తన కల చెదిరిపోయి, ఊహాపథం నుండి క్రిందికి దిగాడు.

"పాలు లేటయినట్టుందీ వేళ... ఇప్పుడే పొయ్యాడు కుక్ ఇటు...." రావ్ తనకు తోచిన సమాధానం చెప్పాడు. నిద్రలేచిన ఇతర డిటెన్యూలు తమ తమ ప్రాతఃకాలపు పనులు ముగించుకోసాగారు.

అంతలోనే గేటు కిర్రుమంది కాన్విక్ట్‌వార్డర్ చక్రధరం వచ్చాడు. తెల్లపంట్లాం, తెల్లటోపి, బుష్‌షర్ట్ ధరించిన చక్రధరం ఆరోజు న్యూస్‌పేపర్ రావ్‌గారికిచ్చి గిరుక్కున వెనుతిరిగాడు. రావ్‌గారికి మనస్సు తొందర చేయసాగింది.

"ఇదిగో సెక్రం... రాత్రి పెరోల్ ఆర్డర్లు ఎవరికైనా వచ్చినవయ్యా!... ఏమిటి? గేటులో కబుర్లు...." రావ్ పిలిచాడు.

గేటులో కబుర్లు అంటే ఆఫీసు కబుర్లని అర్థం. జైలు ముఖద్వారంలోనే జైలు సూపరింటెండెంట్ కార్యాలయం వుంది. ఉద్యోగులందరూ అక్కడే పని చేస్తుంటారు ఎవరినైనా విడుదల చేసినా కొత్త డిటెన్యూలను నిర్బంధానికి తీసుకొచ్చినా, హత్యకేసులో కొత్త నేరస్తులెవరైనా వచ్చినా, ఆ మర్డర్ కేసు వివరాలు మొదలగు భోగట్టా అంతా ముఖద్వారంలో కాపలా కాసే సెంట్రీ పోలీసుల చెవుల్లో పడతాయి. ఆ వార్తలు అక్కడ పని చేసే కాన్విక్ట్ వార్డర్ల నోళ్ళల్లో పడి నానుతూ వార్డు వార్డుకూ వ్యాప్తిస్తుంటాయి.... గేటులో అనుకుంటున్నా"ర"ని వార్తాహరుదు గేటుపై... నెట్టివేసి సమాచారం ముగిస్తాడు.

"మరేనండి... రాత్రి టెలిగ్రామ్ వచ్చిందండీ... ఒక్కరికి వచ్చిందండీ పెరోల్... బహుశా మీకే కావచ్చు నండి"... అన్నాడు అతడు.

రావ్ గాలిలో తేలిపోయాడు. కుక్ కిచెన్ నుండి కాఫీలు పట్టుకొచ్చాడు. ఒక గ్లాసు అందుకొని వార్డర్ చక్రధరానికిచ్చాడు. పొద్దున్నే అంత కమ్మటి వార్త వినిపించినందుకు కానుకగా. "వార్డర్ వెళ్ళిపోయిన తరువాత మెల్లమెల్లగా కాఫీ చప్పరిస్తూ రేడియో స్పీకర్ "స్విచ్" నొక్కాడు.

గోడపై అమర్చిన రేడియోస్పీకర్‌లో చిత్రసీమలో సుశీల పాడుతోంది. ఇంటిని స్వర్గసీమగా పోల్చి తియ్యగా పాడుతోంది. అతని మనస్సులో చివుళ్ళు తొడిగిన ఆనందానికి నేపధ్యగానంగా ఉంది ఆ పాట. కాఫీతో పాటు, పాట కూడా మెల్లగా గొంతు దిగసాగింది. చిత్రసీమ కార్యక్రమం – ఇంతటితో సమాప్తం.... తిరిగి ఈ కార్యక్రమం – " ఎన్‌స్మెంట్.

"సమయం ఎనిమిది గంటలు. ఇంకా కాసేపట్లో హిందీలో వార్తలు. ఢిల్లీ నుండి రిలే.

బయట కలకలం విని రావ్ చూపులు గేటువైపు తిరిగాయి. డిప్యూటీ జెయిలర్ తమ గది ముందుగా నడిచిపోతున్నాడు. అతని వెనుక మరికొందరు డిటెన్యూలు. వాళ్ళడుగుతూన్న ప్రశ్నలకు సమాధానం చెబుతూ నడుస్తున్నాడు. తన గదిలోకి రాలేదు. కనీసం ఆగలేదు. ఎందుకనీ?

"యస్. డాక్టర్ రఘునాథం గాటిట్"

హిందీలో వార్తలు విసుగ్గావున్నాయి. అసహ్యంగా వున్నాయి. బయట మాటలు విననివ్వకుండా గోలగోలగా వున్నాయి. 'టక్' మని స్విచ్ ఆఫ్ చేశాడు. అంతా ప్రశాంతత. ప్రశాంతతలో బయటినుండి వార్తలు వినిపిస్తున్నాయి.

డిప్యూటీ జైలర్ వార్తలు చదువుతున్నాడు.

"పెరల్ ఒక్కరికేవచ్చింది?" – ఎవరిదో ప్రశ్న"

"రావ్ సాబ్‌కు ఎందుకు రాలేదు?" – ఎవరిదో ప్రశ్న"

ఏమో? నన్నడిగితే... నేను ఛీఫ్ సెక్రటరీనా?... జైలర్ జవాబు.

"అరెరే-డెఫినిట్‌గా వస్తుందని అనుకొన్నామే... డాక్టర్స్ పెరోల్ ఈజ్ అన్ ఇక్స్‌పెక్టిడ్"... రామరాజు అంటున్నాడు.

"మే బి"... డిప్యూటీ జెయిలర్ వాళ్లను అక్కడవదిలేసి ముందుకు కదిలాడు.

"డాక్టర్ సాబ్‌కు ఇన్‌ఫామ్ చేసివస్తాను" - అతను కాలివేగం హెచ్చించాడు.

"రావు సాబ్... ఆ వచ్చిన పెరోల్ మీదికాదంట...." మిత్రులు శ్రేయోభిలాషులూ లోనికి విరుచుకుపడి మంచాలపై నిరాశగా కూలబడ్డారు.

మొన్న సాయంత్రానికి ఆర్డర్ పూర్తి కాలేదేమో బహుశా... ఏది ఎలా ఉన్నా అమ్మాయి మధ్యాహ్నానికి రావచ్చునుకుంటా!... అన్ని విషయాలు అప్పటికి తెలిసిపోతాయి...." రామరాజు అతనిని ఓదార్చుతున్న ధోరణిలో వాళ్ళను తృప్తిపరచసాగాడు.

రావ్ కు మనస్సు వికలమైపోయింది.

"అనుకోకుండా డాక్టర్‌కు ఎలా వచ్చింది?-" ప్రశ్న.

"అనుకోకుండా ఏమీ కాదు. ఆయనకు తెలిసిఉండవచ్చు మనకు ఎవరికీ చెప్పలేదుకానీ.... నిన్ననే వాళ్ళావిడ ఇంటర్వ్యూకి వచ్చివెళ్ళింది. బహుశా ఈ విషయం చెప్పిపోవటానికేగావచ్చు దేనికయినా డబ్బండీ... డబ్బుంటేనే పలుకుబడి... వెళ్దాం పదండి...." అంటూ మెట్లుదిగారు.

అన్ని రోజుల్లానే, ఉదయంతో ప్రారంభమైన సోమవారం యధాలాపంగా సాయంత్రంతో అంతమైంది. పగలంతా ఇంటర్వ్యూలు నడిచాయి. డిటెన్యూలకు చాలా మందికి కాల్స్ వచ్చాయి గేటు నుండి. వార్డన్స్ డిటెన్యూ గదులలోకి వచ్చి ఎవరెవరినో పిలుచుకెళ్ళారు... రావ్‌గారిని తప్ప. వారి అమ్మాయి రాలేదు.

ఆశలు లేని రోజులు హాయిగా గడిచి పొయ్యాయి. ఆశలు కల్పించిన రోజు - ఆశగా ఎదురుచూసినరోజు, - నిరాశతో, నిరీక్షణతో గడిచిపోయింది. వరిపొట్టు నుండి బయటికి తీసిన మంచుముక్కలా కరిగిపోయింది ఆ రోజు. సాయంత్రం ఆరు దాటింది. ఇక ఇంటర్వ్యూకి పిలుస్తారన్న ఆశలేదు. ఇటర్వ్యూకాల్స్ నిలిచిపొయ్యాయి.

మెల్లగా సంధ్య చీకట్లు కమ్ముకోసాగాయి. పగలంతా పచ్చని ఆకుల మధ్య ఎర్రగా వికసించిన గులాబీ పువ్వులు రాలిపడిపోతున్నాయి. రాలిపోతున్న గులాబీరేకులు, అరటి మొక్కలు పూల మొక్కలన్నీ ఎత్తయిన జైలు గోడల చీకటి నీడలో కలిసిపోసాగాయి. ఖైదీలకు అన్నం సరఫరా చేసే స్క్వాడ్ ఒక బొంగు మధ్యలో అన్నంబుట్ట కట్టుకొని.

'బ్యాట్నీ, బ్యాట్నీ' అని అరుస్తూ పోతున్నారు. పాడెపై శవాన్ని మోస్తున్నట్లుగా వుంది అదృశ్యం విద్యుద్దీపాలు కళ్ళు రెప్పలాడిస్తూ నిద్ర లేస్తున్నాయి.

'టక్ టక్' మంటూ బూట్ల శబ్దం. పోలీసులు డ్యూటీ మారుతున్నారు.

చీకట్లు దట్టంగా అలుముకున్నాయి. జైలు ఆవరణంతా బోసిబోసిగా గుబులు గుబులుగా మారిపోయింది. ఆ చీకటిలో 'గలగల'మని పళ్ళెం కొట్టినచప్పుడు.

డిటెన్యూల మెస్‌లో రాత్రి భోజనాలకై పిలుపు.

తల నొప్పిగా వుందని రావ్ సాకు చెప్పి భోజనం మానేశాడు. ఫ్లోర్‌సెంటు దీపాల చుట్టూ ముసురుకుంటున్న కీటకాల రెక్కల సవ్వడిమినహా, అంతా ప్రశాంతత. ఆ గదిలో పడుకోవాల్సిన తతిమ్మా నలుగురు డిటెన్యూలు లోనికొచ్చి కడిగిన పళ్ళాలు, గ్లాసులూ బోరగిలా పెట్టి సర్దుకున్నారు. సెంట్రీ పోలీసు అయిదుగురు డిటెన్యూలనూ వ్రేలితో లెక్కించి దుభాలున తలుపులాగాడు.

లాకప్ అయిపోయింది.

లాకప్ తియ్యటంతో మొదలైన సోమవారం లాకప్‌తో ముగిసింది. అన్ని రోజుల్లాగానే 'సోమవారం' కూడా చీకటిలో కలిసిపోయింది. ఎంతో ఎదురుచూసిన ఎన్నో ఆశలు కల్పించిన ఆ సోమవారం క్రూరంగా హింసించి హింసించి మెల్లమెల్లగా తప్పుకొంది.

"సబ్ ఠీక్ హై"

సెంట్రీ పోలీసు పొలికేక ఎదురుగ్గా ఉన్న గోపురంపై ఆ పొలికేకకు ప్రతిధ్వనిగా నాల్గు మూలల నుండి నాల్గు పొలికేకలు - వినిపించి చీకటి ఆకాశంలో కలిసిపోయాయి.

వారం రోజుల తరువాత మరొక్క సోమవారం వచ్చింది. ఆ సోమవారం నాడు కూడా అతనికి ఇంటర్వ్యూ రాలేదు. తనను ఇంటర్వ్యూకి పిలవలేదు. తన కూతురు కూడా రాలేదు. సెక్రెటేరియట్‌లో జరుగుతూన్న విషయాలను గూర్చి ఉత్తరమైనా రాలేదు – ఆరోజు.

సోమవారానికి అతని ఆలోచనల్లో ప్రాధాన్యత పెరిగిపోయింది. శనివారం పర్వదినంగా, పుణ్యదినంగా, గిలిగింతలు పెట్టినట్లుగా సోమవారం అతని మనస్సులో ఆశలురేపే చెరగని ముద్ర వేసికొనసాగింది. తన ఆలోచనల్లో ప్రాధాన్యత సంతరించుకొన్న ఈ సోమవారం అతనిని అనూహ్యమైన మనోవ్యథకు గురిచేయసాగింది.

వరుసగా నాల్గు సోమవారాలు గడిచి పొయ్యాయి. సోమవారాలు కేలండర్‌లో ఎర్రగా అందంగా వుండే ఆదివారాల ప్రక్కనే నిలబడి సోమవారాలు. హాలీడే మూడ్ చెరిపి 'డ్యూటీకి' రమ్మని పిలిచే సోమవారాలు. అధికారం ఫోజుతో నీలిగే వెధవ సోమవారాలు. 'వర్కింగ్ డే' నని ఏడిపించే 'మన్‌డే'లు. నాలుగు దాటిపొయ్యాయి. కేలండర్‌లో నుండి ఒకనెల చిరిగి క్రింద పడిపోయింది.

'పెరోల్" రాలేదు... వస్తుందన్న నమ్మకం లేదు.

పెరోల్ ఇకరాదు... ముమ్మాటికీ ఇకరాదు. జైలు నుండి విడుదల ఒక దురాశ. పెరోల్ మీద తాత్కాలికంగా విడుదల కావటం ఎండమావులు."

సోమవారాల దోబూచులాటలో ఒక నెల రోజులుగా చిక్కుకున్న అతని మనస్సు భ్రమలు తొలిగించుకొని వాస్తవ పరిస్థితులను బేరీజు వేసికోసాగింది. పెరోల్ రాకపోయినా, అమ్మాయి రాకపోయినా కనీసం ఉత్తరం రావలసింది....

.... మరి ఉత్తరం ఎందుకు రాలేదు? మనసు ప్రశ్నించుకోసాగింది.

అయిదవ సోమవారం – ఉత్తరం వచ్చింది.

అది ఇన్‌లాండ్ కవరు కాదు. పెద్ద ఉత్తరం. కవరులో దాచిపెట్టబడిన ఉత్తరం. ఆ ఉత్తరం చెరచబడ్డది. ఆ కవరు డిప్యూటీ జెయిలర్‌తో చించబడి, చదవబడి రావ్‌గారికి చేరింది.

నాన్న గారికి నమస్కారములతో...

నాన్నా!

మీ పెరోల్‌ను గూర్చి మీకు ఆశలు కల్పించినందుకు నన్ను మన్నించమని ప్రార్థిస్తున్నాను.

మీకు పెరోల్ రాలేదు. ఇక రాదు. మీలాంటి ఉగ్రవాదులకు 'పెరోల్' ఇవ్వరనే నగ్నసత్యాన్ని ఈరోజే తెలిసికొన్నాను, దొరకని ఈ శెలవు దొరుకుతుందని నేను భ్రమపడి, ఇటు మిమ్మలను, అటు అమ్మనూ భ్రమింపచేసినందుకు నేను సిగ్గుతో బాధపడుతున్నాను. అనుభవం ద్వారా జీవత సత్యాలను ఇప్పుడే గ్రహించుతున్నాను.

మీకు ఉత్తరం వ్రాసిన నాటినుండి మీ 'పెరోల్' నిమిత్తమై ప్రతిరోజూ ఉదయం సెక్రటేరియట్‌కు పొయ్యే దానిని. పదకొండు, పదకొండున్నర గంటల వరకూ ఎవ్వరినీ లోనికి పోనివ్వరు. కాళ్లు తీపులు పుట్టేవరకూ 'క్యూ' లో నిలబడి ఇంటర్వ్యూ 'స్లిప్' తీసుకొని పన్నెండింటికి సచివాలయం గేటుదాటి లోనికెళ్ళే దానిని.

"ఒక్కరోజు ఛీఫ్ సెక్రటరీ – సి.యమ్.తో మీటింగులో వున్నాడని చెప్పారు. రెండు రోజులు 'ఢిల్లీ' పొయ్యాడన్నారు. రెండు రోజులు గవర్నర్‌తో మాట్లాడడానికి 'వెళ్ళాడు... దొరకడని' చెప్పారు... మధ్యమధ్యలో పబ్లిక్ హాలీడేస్. మొత్తానికి మూడు వారాలు తిరిగితే ఒక్కరోజు ఇంటర్వ్యూ దొరికింది. ఒక్కక్షణం మాత్రమే మాట్లాడాడు. సి.యమ్. రికమండ్ చేసిన అప్లికేషన్ ఇచ్చాను– "ఐవిల్. సీ... యుకెన్ గో"…. అన్నాడు.

ఆ రెండో రోజు అతని ఆఫీసుకెళ్ళాను నా దరఖాస్తు ఏ సెక్షన్‌లో ఉన్నదో తెలియదు. ఈ సెక్షన్‌లో అడిగితే ఆ సెక్షన్‌లో ఉన్నదంటారు. అక్కడ అడిగితే ఇక్కడ వుంటుందని సమాధానం ఈ గుమస్తాలు చాలా బ్యూరా క్రేట్స్.

బ్రిటీషువాళ్ళు వెళ్ళిపోయినా వాళ్ళ బ్యూరోక్రసీ ఇనపచట్రం అలాగే వుంది. మయసభలాంటి ఈ ప్రభుత్వ యంత్రాగంలో, ఒక ఫైలు అంచెలంచెలుగా పైకి పోవటం, పైనుంచి క్రిందకు రావటం... మొదలైన తతంగమంతా ఒక పెద్ద కుట్ర.

మన బూర్జువా పాలక వర్గానికి ఈ బ్యూరాక్రసీ ఒక ఫెద్ద కవచం.

ఈ బ్యూరాక్రసీలో పనులు చేయించుకోవటం ఒక్క శ్రీమంతవర్గానికే సాధ్యం. చిన్న గుమస్తా నుండి పెద్ద సెక్రటరీ వరకూ వీళ్ళంతా తాగుబోతులు. పరాన్న భుక్కులు, ప్యారసైట్స్. సాయంత్రం ఎయిర్ కండిషన్డ్ హోటళ్ళలో 'సప్త' నక్షత్రాల హోటళ్ళలో ఎవరు పీకలమట్టికి త్రాగించి, మూడు సున్నాల బిల్లులు కట్టగలరో ఎవరు పడవల్లాంటి కార్లలో తిప్పలగలరో వాళ్ళ పనులు మాత్రమే చేస్తారు.

వచ్చీరాని ఇంగ్లీషు మాట్లాడి, సామాన్య జనాన్ని హడలుకొట్టే వీళ్ళు అసలు సిసలైన బ్రిటిష్ ఏజెంట్లు, రెడ్ టేపిజానికి మూలస్థంభాలు – అధికార దర్పానికి ఆడంబరత్వానికి, అహంకారానికి సంకేతాలు వీళ్ళు.

అవినీతి, లంచగొండితనం క్యాన్సర్ వ్యాధిలా ప్రబలివున్న ఈ బ్యూరోక్రాటిక్ సెక్రటేరియట్‌లో యధాలాపంగా పనులవుతాయని భ్రమపడి ఇన్నాళ్ళూ నేను హైద్రాబాద్‌లో వున్నాను.

నేను మన అత్తయ్య గారింటిలో గడిపినా నేను తెచ్చుకున్న నూట యాభై రూపాయలు సిటి బస్సులకే సరిపొయ్యాయి. ఎంత పొదుపుగా ఖర్చు పెట్టినా నూట యాభై రూపాయలు ఖర్చయి పొయ్యాయి. పనికాలేదు. డబ్బు వృధాగా ఖర్చయిపోయింది. అదే నాకు దిగులుగా వుంది. నూట యాభై రూపాయలు మనకు ఒక నెల బియ్యం. ఒక నెల రోజులు కిరాయి. "పనికాకపోతే వెంటనే రాకూడదా?... నూట యాభై రూపాయలు ఖర్చు చేశావని అమ్మ తిడుతుంది. ఆమెకు నేను భయపడటం లేదు. ఎందుకు అంటే తప్పు చేసినందుకు శిక్ష అనుభవించాలి.

మీ గూర్చి నేను బాధపడుతున్నాను. మనలను గూర్చి నేను వ్యధవడుతున్నాను. మనల్లాంటి ఎందరినో గూర్చి మనస్సు దహించుకుపోతోంది. మనలాంటి వాళ్ళకు పెరోల్ దొరకదు. మనలాంటి పేదవాళ్ళ పనులు చెయ్యటానికి కాదు ఈ ఆఫీసులు. గొప్ప వాళ్ళకోసం. ఇంటర్వ్యూకొచ్చి మీతో ఇవన్నీ చెప్పాలనుకొన్నాను. కానీ ఆర్డర్ లేకుండా మీ జైలు ఆవరణలోకి రావటం మనస్కరించటంలేదు. మీ విడుదలకై ఎన్ని సంవత్సరాలైన ఎదురుచూస్తాం, కానీ ఈ 'పెరోల్'కై ప్రయత్నించం. ఇదొక పేరాశ.

ఇట్లు

మీ కుమార్తె. నిర్మల

"పేరాశ కాదు... దురాశ.... ఆత్మవంచన....."

అనుకొంటు పెదవులు లోనికి ఒత్తుకున్నాడు. మనస్సు ప్రశాంతంగా వుంది ఉత్తరం చదివిన పిదప. సిగరెట్ నోట్లో పెట్టుకొని ఆలోచించసాగాడు. రెండున్నర సంవత్సరాలుగా జైలు గోడల మధ్య ఊపిరి పీల్చుకుంటున్న తనకు కుట్రకేసులో ఇరికించి పోలీసు మొదటిసారిగా జైల్లో పడవేశారు. రెండున్నర సంవత్సరాలు జైలులో గడిపిన పిదప 'రిలీజ్' దొరికింది. ఒక్క వారం రోజులు తిరుగక ముందే అత్యవసర పరిస్థితి ప్రకటించింది ప్రభుత్వం.

జూన్ నెల ఇరవై ఆరు నాడు నిద్రమంచంపై అరెస్ట్ చేసి లోపల పడవేశారు... మళ్ళీ.

ఆరోజు నుండి విముక్తి లేదు.

ఈ నెల రోజులు 'పెరోల్' ను గూర్చి ఎందుకిలా తహతహలాడి పోటానికి కారణం అతనికి స్ఫురించలేదు. ఒక నెలరోజులు ఇంటివద్ద గడపటం వలన తనకు కలిగే ప్రయోజనం ఏముంది?... ఏమీ లేదు. ఈ నెల రోజుల్లో ఎన్నో పనులు చెయ్యలేక తిరిగిరావటం మినహా మరొకటి లేదు.

ఈ నెలరోజుల శెలవుకోసమై తన బిడ్డ, తన శత్రువు ముందు చేతులు జోడించుకుని నిలబడటం దానికి వాడు తనను లొంగదీసికొన్నట్లుగా నవ్వడం... మొదలైన సంఘటనలను ఊహించుకొని కళ్ళు అగ్ని గోళాలయ్యాయి.

లొంగతీసికొన్న సంతృప్తిని శత్రువుకు మిగల్చటానికి ఉపకరించే ప్రతిచర్య ఆత్మ దౌర్భల్యంతో కూడినదే.... ఎంత పొరపాటు చేశానని ఆత్మవిమర్శ చేసికోసాగాడు.

బ్రిటిష్ సామ్రాజ్యవాద ఉక్కుపిడికిళ్ళ నుండి దేశాన్ని విముక్తి చేసిన అమరవీరుల ఆశయాల ఒరవడిలో జీవితాన్ని తీర్చిదిద్దుకొన్న ఉద్యమకారుడుగా తాను ఈ నిర్బంధానికి తలఒగ్గకూడదు" అనుకుంటూ పిడికిళ్ళు బిగించుకొని ఛాతి విరుచుకొని కిటికీ చెంత నిలబడ్డాడు.

కిటికీ ఇనుపచువ్వల ఆవల ఎత్తయిన జైలు ప్రహరీగోడ. ఆ జైలు గోడ ఆవల ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, విప్లవాలు. దేశం తనను పిలుస్తోంది.

కిటికీ చెంత సాలీడు దారాలు అల్లుతోంది.

నియంత ఆర్డినెన్స్‌లు, రాజ్యాంగ సవరణల ఉచ్చులల్లుతోంది. అవి – స్వతంత్ర భారతదేశంలో జైళ్ళు కళకళలాడుతున్న మహోజ్వలమైన రోజులు.

సేకరణ : "స్వాతి" డిసెంబర్, 1980 సంచిక

సంపాదకులు – వేమూరి బలరామ్